ఆంధ్రజ్యోతి 7-7-18

# యాంత్రీకరణతో వ్యవసాయం సులభం

- వ్యవసాయ వర్సిటీలో రెండోవిడత రైతు శిక్షణా కార్యక్రమం
- పాల్గొన్న గజ్వేల్, తూప్రాన్‌కు చెందిన అభ్యుదయ రైతులు
- యాంత్రీకరణపై క్షేత్రప్రదర్శన నిర్వహించిన శాస్త్రవేత్తలు



పాలిథీన్ షీటుపై నారు పెంచే పద్ధతిని రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు



యంత్రాలను పరిశీలిస్తున్న రైతులు

రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వరి పరిశోధనా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రెండో విడత రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్, తూప్రాన్‌కు చెందిన అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. వివిధ పంటలలో అధికదిగుబడిని సాధించడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతాంగానికి తెలియజేశారు. ప్రధానంగా వరిలో యాంత్రీకరణ ప్రోత్సహించడానికి, మిషన్ నాట్లకు అనువైన పాలిథీన్ షీటుపై నారు పెంచే పద్ధతిపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగింది. చిన్న, సన్నకారు రైతులు కూడా తమకు ఉన్న చిన్న కమతాలలో అధిక ఆదాయం సాధించడానికి సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో భాగంగా అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని పంటలు, పశువులు, అనుబంధంగా కోళ్ళు పెంచుకొని రైతు రోజువారి ఆదాయం పెంచుకోవడానికి గల అవకాశాలను వివరించారు. వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించడానికి అందుబాటులో ఉన్న వ్యవసాయ పనిముట్లను, వరినాటు యంత్రాలు, కలుపు తీయు మిషన్లపై అవగాహన కల్పించడం, వివిధ యంత్రాలను రైతులకి చూపించడం జరిగింది. రైతులకు ఉన్న సందేహాలను ముఖ్యంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలలో అధిక దిగుబడి సాధించడానికి పాటించవలసిన యాజమాన్య పద్ధతులను, చీడపీడల నివారణ తదితర విషయాలను తెలియజేడయడం జరిగింది. అడవిపందులు, కోతులు, నెమళ్ళ నుంచి పంటలను కాపాడటంపై సందేహాలను నివృత్తిచేయడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో తూప్రాన్, గజ్వేల్‌కు చెందిన 15 మంది అభ్యుదయ రైతులు పాల్గొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలు డాక్టర్ దామోదర్‌రాజు, డాక్టర్ వర్మ, డాక్టర్ స్పందన, డాక్టర్ లవకుమార్‌రెడ్డి, డాక్టర్ శ్రీలత, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ శ్రావంతి, డాక్టర్ గోవర్ధన్, డాక్టర్ వాసుదేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.